క్లుప్తంగా

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గోవిందరెడ్డి



ఆత్మకూరు: పట్టణంలో గురువారం జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా న్యాయవాది గోవిందరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి పుల్లారెడ్డి తెలిపారు. అలాగే ప్రధాన కార్యదర్శి శివశంకర్, ఉపాధ్యక్షులుగా మల్లికార్జునసింగ్, కోశాధికారిగా లక్ష్మీనారాయణ, కార్యదర్శిగా చింతలయ్య, మీడియా కార్యదర్శిగా సుదర్శనశర్మ, లైబ్రేరియన్‌గా ఉసేన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. ఏకగ్రీవంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవిందరెడ్డికి పలువురు న్యాయవాదులు అభినందనలు తెలియజేశారు.

నందీశ్వరుడికి ప్రదోషకాల విశేషాభిషేకం



అభిషేకం చేస్తున్న పండితులు, అర్చకులు

మహానంది: మహానందిలో కొలువైన నందీశ్వరస్వామికి గురువారం ప్రదోష కాలంలో ప్రత్యేక అభిషేకం, అర్చనలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, అర్చకులు ముందుగా నందీశ్వరస్వామి పాలాభిషేకం, పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకపూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. పలు ప్రాంతాల భక్తులు నందీశ్వరస్వామికి జరిగిన అభిషేకంలో ఆర్జిత సేవల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ సుబ్బారెడ్డి, అర్చకులు రఘుశర్మ, ధర్మతేజ, జనార్దనశర్మ పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



సంప్రదాయ నృత్య ప్రదర్శనలో కళాకారులు

శ్రీశైలంటెంపుల్: ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని కన్నడ భక్తులను అలరించేందుకు శ్రీశైల దేవస్థానం పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసింది. గురువారం ఆలయ దక్షిణమాడవీధిలో శ్రీశైల జగద్గురు సేవా సమితి ట్రస్ట్ వారిచే ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, సంప్రదాయ నృత్యాలు, శివనామ భజనలు ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌కు చెందిన కురగంటి కళాక్షేత్రానికి చెందిన కె.రాధిక వారి కూచిపూడి నృత్యం, ప్రసిద్ధ నేపథ్య గాయనీ, గాయకులచే భక్తి సంగీత విభావరి(కన్నడ), క్రాంతి నారాయణ, బృందం వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన, కర్ణాటక, భాగాల్‌కోట్‌కు చెందిన డి.ఇందుమతి వారి భజన కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

దుకాణంలో అగ్నిప్రమాదం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

ఆత్మకూరు: పట్టణ శివారులోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా ఏర్పాటు చేసిన పాత సామాన్ల కొనుగోలు దుకాణంలో బుధవారం అగ్ని ప్రమాదం సంభవించింది. బాధితుల కథనం మేరకు.. విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో దుకాణంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఆత్మకూరు అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. పాత సామాన్లు మొత్తం కాలిపోయాయని, దాదాపు రూ.4 లక్షల మేర ఆస్తినష్టం జరిగిందని బాధితులు కోరారు.

సూపర్ సిక్స్ పేరుతో బాబు మోసం



వేదపండితుల ఆశీర్వచనం అందుకుంటున్న తడక జగదీశ్వర్ గుప్తా

మహానంది: సూపర్ సిక్స్ పేరుతో చంద్రబాబు నాయుడు ప్రజలను మోసం చేశారని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు తడక జగదీశ్వర్ గుప్తా అన్నారు. గురువారం ఆయన కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. అనంతరం జగదీశ్వరగుప్తా మాట్లాడుతూ ఇచ్చిన మాటను నెరవేర్చడంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎవరూ సాటిరారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలను, చిరువ్యాపారులను వేధించడం ఎక్కువైందని, మహానందిలో చిరువ్యాపారులపై ఆదాయం పేరుతో వేధించడం బాధాకరమన్నారు.



పాదయాత్రగా తరలివస్తున్న కన్నడ భక్తులు



క్షేత్రంలో ఏర్పాటు చేసిన ఉగాది మహోత్సవాల స్వాగత తోరణం

శ్రీగిరి క్షేత్రం..
ఆధ్యాత్మికభరితం!

- శ్రీశైలానికి పోటెత్తిన కన్నడ భక్తులు
- కన్నడిగుల శివనామస్మరణతో మారుమోగుతున్న శ్రీగిరి క్షేత్రం
- పాదయాత్రలో వేలాదిగా తరలివస్తున్న కన్నడ భక్తులు

శ్రీగిరి క్షేత్రం.. ఉగాది మహోత్సవాల సందర్భంగా ఆధ్యాత్మికభరితంగా మారింది. కర్ణాటక, మహారాష్ట్రాలకు చెందిన వేలాది మంది కన్నడ భక్తులు గురువారం మల్లన్న సన్నిధికి చేరుకుని పూజల్లో తరించారు. పలువురు కన్నడ భక్తులు పల్లకీల ముందు కుంకమ చల్లుకుంటూ, చిందులు వేస్తూ మల్లన్నను కీర్తించారు. కన్నడ భక్తుల నృత్యాలతో శ్రీగిరి క్షేత్రం మరింత ఉత్సవ శోభను సంతరించుకుంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ పూజావేళల్లో మార్పులు చేసి వేకువజాము నుంచే భక్తులను స్వామిఅమ్మవార్ల దర్శనానికి అనుమతిస్తున్నారు. వేకువజామునే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మల్లన్న దర్శనానికి ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్లలో బారులుదీరారు. భక్తులందరికీ సౌకర్యవంతమైన దర్శనం కల్పించాలనే ఉద్దేశంతో మల్లన్న అలంకార దర్శనం కల్పిస్తున్నారు.

– శ్రీశైలంటెంపుల్



క్షేత్ర పురవీధుల్లో కుంకుమ చల్లుకుంటూ, చిందులు వేస్తున్న కన్నడ భక్తులు



క్షేత్రంలో పలువురు కన్నడ భక్తుల విన్యాసాలు

1న అంతర్రాష్ట్ర ఎడ్ల బండలాగుడు పోటీలు

కొత్తపల్లి: ఉగాది పర్వదినం సందర్భంగా మండల పరిధిలోని కొక్కెరంచ గ్రామంలో చెన్నకేశవ స్వామి గుడి తరపున ఏప్రిల్ 1న అంతర్రాష్ట్ర ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే రోజు రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి జట్ల పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. గెలుపొంది వృషభాల యజమానులకు వరుసగా రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.7వేలు, రూ.5వేలు, రూ.4వేలు, రూ.3వేలు, రూ.2 వేల నగదు బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు 9490406045, 7799234299, 9989949862 నంబర్లను సంప్రదించాలన్నారు.

నూతన పైపులైన్ నిర్మాణం

పాములపాడు: మండలంలోని జూటూరు గ్రామంలో గురువారం నూతన పైపులైన్ నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచు నాయిని సావిత్రమ్మ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ నిధులతో పైపులైన్ నిర్మాణం చేపట్టామన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామంలోని అన్ని కాలనీలకు నీటి సరఫరా చేసే ఉద్దేశంతో బీసీ కాలనీలో పనులు చేస్తున్నామన్నారు. గ్రామంలో నీటి సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు.



నూతన పైపులైన్ నిర్మాణం చేపట్టిన దృశ్యం

ఉగాది ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు

- జిల్లా ఎస్పీ అది రాజ్ సింగ్ రాణా

శ్రీశైలం: ఉగాది మహోత్సవాల సందర్భంగా కర్ణాటక, మహారాష్ట్ర నుంచి తరలివచ్చిన లక్షలాదిమంది భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకొని శ్రీశైలంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా తెలిపారు. శ్రీశైలం ఉత్సవాల విధుల్లో పాల్గొననున్న పోలీస్ అధికారులు, సిబ్బందితో ఆయన గురువారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో సమావేశమై పలు సూచనలు చేశారు. నంద్యాల కర్నూలు, కడప, అన్నమయ్య జిల్లాల నుంచి ఆరుగురు డీఎస్పీలు, 40 మంది సీఐలు, 100 మంది ఎస్ఐలు, 1,500 మంది సివిల్, 200 మంది ఏఆర్, 200 మంది ఏపీఎస్పీ, వంద మంది స్పెషల్ పార్టీ పోలీసులను బందోబస్తుకు ఉపయోగిస్తున్నామన్నారు. ఎనిమిది వందల సీసీ కెమెరాలు, మూడు డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం 15 బ్లూ కోల్ట్, 15 రక్షక్ వాహనాలను వాడుతున్నామన్నారు చోరీలు జరగకుండా ఉండేందుకు క్రైమ్ పోలీసులను, సెక్యూరిటీలో భాగంగా బాంబ్ డిస్పోజల్ టీమ్స్, డీఎఫ్ఎండీ, హెచ్‌హెచ్ఎండీలను క్యూల వద్ద ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో నంద్యాల ఏఆర్ అడిషనల్ ఎస్పీ చంద్రబాబు, ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్, శ్రీశైలం వన్ టౌన్ సీఐ ప్రసాద్‌రావు పాల్గొన్నారు.



రద్దీ ప్రాంతంలో భద్రతా ఏర్పాట్ల గురించి సూచనలిస్తున్న ఎస్పీ

తేనెటీగల పెంపకంతో అధిక లాభాలు



మాట్లాడుతున్న ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.మోహన్ రావు

కొత్తపల్లి: తేనెటీగల పెంపకంతో రైతులు అధిక లాభాలు ఆర్జించవచ్చని కీటకశాస్త్రం ప్రధాన శాస్త్రవేత్త, అధిపతి, వ్యవసాయ పరిశోధన స్థానం విజయవాడ డాక్టర్ కె.మోహన్ రావు సూచించారు. మండలంలోని పాలెంచెరువు గూడెంలో మూడవ రోజు తేనెటీగల పెంపకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణలో భాగంగా తేనెటీగలలో రకాలు, వాటి స్వభావం, తేనెటీగలు తేనెను ఏ విధంగా వివిధ మొక్కల పుష్పాల నుంచి సేకరించడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకాన్ని ఏ విధంగా చేపట్టవచ్చు, వాటి పెంపకంలో ఎదురయ్యే సవాళ్లు, చీడపీడలు, వాటి యాజమాన్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు కె.అశోక్‌కుమార్, కె.మోహన్ విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

ఉద్యోగులను వేధించడం మానుకోవాలి

నందికొట్కూరు: ప్రజాప్రతినిధులు ఉద్యోగులను వేధించడం మానుకోవాలని ఏపీ ఎన్‌జీఓ ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షులు సీహెచ్ వెంగళరెడ్డి హెచ్చరించారు. గురువారం స్థానిక ఏపీ ఎన్‌జీఓ భవనంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులతో ఫ్రెండ్లీగా ఉండాలని కోరుతున్నామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు విధులు నిర్వర్తిస్తామన్నారు. సమావేశంలో ఏపీ ఎన్‌జీఓ ఇన్‌చార్జ్ కార్యదర్శి కృష్ణుడు, సహ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, కర్నూలు పట్టణ అధ్యక్షులు కాశన్న, తాలూకా అధ్యక్షులు రాముడు, కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు రాజశేఖర్, వరలక్ష్మి, ఉమెన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకటలత, జాయింట్ సెక్రటరీలు చెంచన్న, మాదన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీహెచ్ వెంగళరెడ్డి

28న విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా

నందికొట్కూరు: విద్యుత్ స్మార్ట్ మీటర్లకు, సర్దుబాటు చార్జీలకు వ్యతిరేకంగా ఈ నెల 28న విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు సీపీఎం నాయకులు నాగేశ్వరరావు తెలిపారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం కరెంట్ చార్జీలు పెంచబోమని ఎన్నికల ముందు చెప్పి తొమ్మిది నెలల కాలంలో రెండు సార్లు సర్దుబాటు పేరుతో పెంచిందన్నారు. గత ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగిస్తుంటే వ్యతిరేకించిన చంద్రబాబు నాయుడు, లోకేష్ ఇప్పుడు అదే ఒప్పందాలను కొనసాగించడం దుర్మార్గమన్నారు. గృహ వినియోగదారులకు 200 యూనిట్లు పైబడిన వారికి స్మార్ట్ మీటర్లు బిగించడం తగదన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు వెంకటేశ్వర్లు, కర్ణ, శేఖర్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు బిల్లులు చెల్లించాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

నందికొట్కూరు: ఆరు వారాల నుంచి పెండింగ్‌లో ఉన్న గ్రామీణ ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులు చెల్లించాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, చెరుకుచెర్ల సుధాకర్ డిమాండ్ చేశారు. గురువారం మిడుతూరులో ఉపాధి పనుల బిల్లులు చెల్లించాలని కూలీలతో కలిసి వారు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూలీలకు ఆరు వారాల నుంచి బిల్లులు చెల్లించకుండా జాప్యం చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. 10 రోజులకోసారి ఉపాధి బిల్లులు చెల్లించాలన్నారు. కూలీలకు గడ్డపార, పీకాసితో పాటు పనిముట్లు మంజూరు చేయాలన్నారు. పనిప్రాంతంలో టెంట్, మెడికల్ కిట్లు, మజ్జిగ, మంచినీరు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రమణ, నాగన్న, రాజు, అఖిల్, రాజేస్, ఏసన్న, మహిళలు సరోజమ్మ, రాధమ్మ, పుణ్యవతి, రోజమ్మ, శేషమ్మ, ప్రమీలమ్మ పాల్గొన్నారు.

మేటీలకు గౌరవ వేతనం ఇవ్వాలి

బండి ఆత్మకూరు: ఉపాధి హామీ మేటీలకు గౌరవ వేతనం ఇవ్వాలని రైతు సంఘం జిల్లా నాయకుడు డేవిడ్ డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ మేటీలకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మొబైల్ రీచార్జ్ చేయాలని, సైకిల్ ఇవ్వాలని, కొలతలు వేసేందుకు టేపుతో పాటు రవాణా చార్జీలు, గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. అలాగే ఉపాధి కూలీలు పనిచేసే ప్రదేశంలో మంచి నీరు, మజ్జిగ అందజేయాలని కార్యక్రమంలో వ్యవసాయ సంఘం నాయకులు రామచంద్రుడు, చంద్రబాబు, మల్లికార్జున,మద్దిలేటి పాల్గొన్నారు.

ఏప్రిల్ 1న తర్తూరులో వేలంపాటలు

జూపాడుబంగ్లా: ఏప్రిల్ 1న తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథస్వామివారి ఆలయంలో వేలంపాటలు నిర్వహించనున్నట్లు ఫెస్టివల్ కమిటీ చైర్మన్ తరిగోపుల నారాయణరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ టెంకాయలు, లడ్డూ ప్రసాదం విక్రయాలు, కొబ్బరిచిప్పల సేకరణకు వేలం పాటలు నిర్వహించనున్నామని, ఆసక్తి ఉన్న వారు రూ.10 వేల ధరావత్తు చెల్లించి వేలం పాటల్లో పాల్గొనాలన్నారు. హక్కులు దక్కించుకున్న వారు ఏప్రిల్ 6 నుంచి 20వ తేదీ వరకు జాతరలో టెంకాయలు, లడ్డూప్రసాదం, కొబ్బరిచిప్పలపోగు చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

నివాళి

పాములపాడు: అనారోగ్యంతో మృతి చెందిన మండల కేంద్రానికి చెందిన చాకలి అచ్చమ్మ(96) మృత దేహానికి ఎమ్మెల్యే గిత్తా జయసూర్య గురువారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నియామకం



నాగలింగమయ్యకు నియామక పత్రం అందిస్తున్న నాయకులు

పాములపాడు: జాతీయ బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కార్యదర్శిగా భోగినం నాగలింగమయ్యను నియమించినట్లు సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి వేంపెంట రాంబాబు, జిల్లా కన్వీనర్‌గోపాల్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు నియామక పత్రాన్ని అందజేశారు. సమావేశంలో సంఘం మండల కన్వీనర్ మురళీమోహన్, ప్రధాన కార్యదర్శి రామ్మోహన్, వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ కో–ఆప్షన్ మెంబర్‌గా ఇలియాజ్‌ఖాన్



జెడ్పీ చైర్మన్‌తో జిల్లా కో–ఆప్షన్ మెంబర్ ఎం ఇలియాజ్‌ఖాన్

వెలుగోడు: జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడిగా వెలుగోడుకు చెందిన ఎం ఇలియాజ్‌ఖాన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యులు సయ్యద్ సులేమాన్ మృతితో ఖాళీ అయిన స్థానానికి జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ నాయకులు శిల్పా భువనేశ్వర్ రెడ్డి సమక్షంలో సభ్యులు ఇలియాస్ ఖాన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఇలియాజ్‌ఖాన్‌ను పలువురు అభినందించారు. తనపై నమ్మకం ఉంచి అవకాశం కల్పించిన మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి, జెడ్పీటీసీ అమీరున్ బీ, పార్టీ జిల్లా నాయకులు దేశం తిరుపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

నందికొట్కూరు: ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని అఖిల భారత మాల సంఘాల జేఏసీ రాయలసీమ గౌరవ అధ్యక్షులు చెరుకు అశోకరత్నం, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోన నాగరాజు అన్నారు. గురువారం పట్టణంలోని బసిరెడ్డి కళాశాల సమీపంలో అఖిల భారత మాల సంఘాల జేఏసీ కార్యాలయాన్ని వారు ప్రారంభించారు. భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ మాల, మాదిగలకు నష్టమేనన్నారు. రాజకీయ పబ్బం కోసం సీఎం చంద్రబాబు నాయుడు ఏపీలో అత్యుత్సాహం ప్రదర్శించి ఎస్సీ వర్గీకరణ చేసి ఒక వర్గానికి దగ్గరయ్యారన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా చేసే పోరాటంలో పాల్గొని మాలల సత్తా ఏమిటో చూపించాలని వారు సూచించారు. కార్యక్రమంలో మాల సంఘాల జేఏసీ నాయకులు తమ్మడపల్లె ఏసేపు, శివప్రసాద్, జాన్, డాక్టర్స్ ఎర్రన్న, రాజు, నాగరాజు, శ్రీను, పుల్లన్న, రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాల సంఘాల జేఏసీ నాయకులు

జూటూరులో మహారాష్ట్ర పీఠాధిపతి

పాములపాడు: మహారాష్ట్రలోని షోలాపూర్ పట్టణం సిద్ధరామేశ్వర పీఠాధిపతి ఆకాష్‌మహారాజ్ గురువారం మండలంలోని జూటూరు గ్రామ శివారులో ఉన్న నాగసాయిబ్రహ్మ విద్య ఆశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆశ్రమ పీఠాధిపతి రామానంద స్వామి మేళతాళాలు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూలమాల వేసి ఆశ్రమ ఆచారాల ప్రకారం గురుపూజ చేశారు. ఉగాది పండుగను పురస్కరించుకుని శ్రీశైలం మల్లికార్జున స్వామి, భ్రమ రాంబ అమ్మవార్ల దర్శనార్థమై పాదయాత్రగా వెళ్తూ ఆశ్రమాన్ని సందర్శించారు. ఆశ్రమ భక్తులకు ఆశీర్వచనం ఇచ్చారు. అక్కడే అన్నదాన కార్యక్రంలో పాల్గొని సేద తీరారు. అనంతరం తన వెంట ఉన్న భక్తులతో కలిసి పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు.



మహారాష్ట్ర పీఠాధిపతి ఆకాష్ మహారాజ్‌తో ఆశ్రమ భక్తులు

మద్యం విక్రయిస్తే కేసులు నమోదు

నందికొట్కూరు: గ్రామాల్లో మద్యం, నాటుసారా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ శాఖ సీఐ రామాంజనేయులు, కర్నూలు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిణి సుభాషిణి హెచ్చరించారు. గురువారం తమ సిబ్బంది జరిపిన సోదాల్లో మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో వడ్డే రమేష్ వద్ద నుంచి 11 సీసాలు, జూపాడుబంగ్లా మండల పరిధిలోని పారుమంచాల గ్రామంలో వడ్డే మహేష్ నుంచి 12 సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా 15 రోజులు రిమాండ్‌కు ఆదేశించినట్లు చెప్పారు. సోదాల్లో ఎక్సైజ్ ఎస్ఐ జఫ్రుల్లా, సిబ్బంది శంకర్ నాయక్, శివన్న, మధుసుధన్‌రెడ్డి, రామాంజనేయులు, సంధ్యారాణి, విద్యా ప్రియదర్శిని పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని సిద్ధిరామప్ప కాంప్లెక్స్ వద్ద పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు సీఐ ప్రసాద్‌రావు గురువారం రాత్రి తెలిపారు. కర్నూలు జిల్లా కొతాళం మండలం వల్లూరు గ్రామానికి చెందిన ఉరుకుంద, దేవరాజ్, విశ్వనాథ్ గౌడ్, వెంకటేష్, ఆదేప్ప పేకాట ఆడుతుండగా డ్రోన్ ద్వారా నిఘా పెట్టి వారిని అరెస్ట్ చేసి, రూ.17,630 సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు.